


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 9 పుష్పం : 22-24 20-01-2002

ష్ట్రఖుఖుశ్రీజు ఔకజుఐచజుష్ట్రజు
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 20
**VOL : 7** **ISSUE : 9**
EDITOR
**P.S. RAMA RAJU**
EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
ష్ట్రఖుఖుశ్రీజు ఔకజుఐచజుష్ట్రజు
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.
**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689
**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## ఆధారతత్త్వం

ఏదివాస్తవంగా ఈసృష్టికి ఆధారతత్త్వంగా ఉందో, దానికి పుట్టుకలేదు, మరణమూలేదు, అది చంపబడదుకూడా. ఆ తత్త్వాన్నే మనము మనలోపల మూలతలంపుయొక్క మూలం (స్వరూపం)గా దర్శిస్తాం; అదే తత్త్వాన్ని అనంతంగా విశ్వవ్యాప్తంగా దర్శిస్తే పరమాత్మ అవుతుంది. జగత్తులోని నామ, రూపాలు, శరీరాలు అన్ని చివరకు నశించేవే. ఒకప్పుడు పుట్టినట్లు గోచరించే వాటియొక్క ముగింపు మరణం. సృష్టిలో మనము దేనిని చూచినా జనన, మరణాలకు లొంగిఉన్నదే అవుతోంది. ఈ జననమరణ ప్రక్రియ వెనుక ఆరెంటికి అతీతమ్మైన ఒక ఆధారతత్త్వం దాగియుంది. అదే ఆత్మ. అదే మన నిజస్వరూపం. అదే 'నిజమైన - నేను'.

**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

27-12-2001 కేశవరం ........ 3
26-12-2001 కాపవరం ........ 10
25-12-2001 కొవ్వాడ ........ 15





మనము సినిమా చూస్తూఉంటాము, రకరకాల బొమ్మలు వస్తూఉంటాయి. పోతూఉంటాయి, ఇదంతా జరగడానికి ఒక తెర ఆధారంగా నిలుస్తుంది. బొమ్మలు కదులుతాయి, కాని తెరమాత్రం కదలదు. బొమ్మలయొక్క గుణ, క్రియాదులు తెరను ఏమాత్రం అంటవు. సినిమా చూస్తున్నంతసేపు అసలు తెరఅంటూ ఒకటి ఆధారంగా ఉన్నదనే ఆలోచనేరాదు. తెరపై సినిమా బొమ్మల మాదిరి ఈ సృష్టిఅంతా 'ఆత్మ' లో కదులుతోంది, అనగా ఈసృష్టికి ఆత్మే ఆధారం. నిరంతరం మార్పుచెందే ఈ నామ, రూప జగత్తుకు మార్పులేని సత్యం ఆధారంగాఉంది. మన జీవితమూ ఒక సినిమాలాంటిదే, అనగా రకరకాల చిత్రాల సంగ్రహములాంటిదే, కాని దాని వెనుక మార్పులేని స్థిరమైన తెరలాంటి ఆధారసత్యం నిలిచియుంది, అదే 'నిజమైన - నేను' అదే ఆత్మ, అదే కేవలబ్రహ్మము, తానుతానుగాఉంది. కాబట్టి సమస్త దృశ్యాన్ని కలుపు మొక్కలలాగ సారహీనమైనవిగా భావించి 'నిజమైన - నేను' లో స్థిరముగా ఉండుటయే వివేకవంతుల లక్షణం. దేహంపుట్టుకతోటి దేహం మరణంతోటి సంబంధంలేకుండా ఏవస్తువైతే సృష్టికి ఆధారంగా ఉందో అదేనీవు. కావున నీవునీవుగా ఉండు. అహంకారాన్ని వదల్చుకో! ఆత్మవే అయిపో !

**చావలి సూర్యనారాయణమూర్తి**
టీచర్
అమలాపురం

**ఓం నమో భగవతే శ్రీ రమణాయ**

# రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-12-2001, కేశవరం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

లోపల హృదయంలోఉన్న సత్యవస్తువు ఒక్కటిగా ఉన్నప్పటికి జీవకోటిలో ఎంతో భిన్నత్వం ఉంటుంది, శరీరాల రూపాలుతేడగాఉంటాయి. మనస్సులో గుణాలుతేడాగాఉంటాయి. రకరకాలుగా ఉంటారు. జీవకోటినందరిని దృష్టిలోపెట్టుకొని భగవంతుడు గీతను చెప్పాడు. భగవద్గీత ఉపదేశగ్రంథం. జీవకోటిలో ఎన్నిరకాల మనస్తత్వాలుఉన్నా వారికందరికి ఉపయోగపడే శ్లోకం, వారిమనస్సుకు శాంతినికలుగుజేసే శ్లోకం, మనస్సుకు అంతరదృష్టిని కలుగజేసే శ్లోకం గీతలోకనిపిస్తుంది. గీత అర్జునుడికేకాదు, ఆబోధ మనకుకూడా వర్తిస్తుంది. జీవకోటిమీదఉన్న ప్రేమతో భగవంతుడు గీతనుచెప్పాడు. ఇది సమన్వయగ్రంధము. కర్మయోగానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తూచెప్పాడు. పనికి జ్ఞానానికి విరోధంలేదు. పనివిడిచిపెట్టి ఎక్కడికి పారిపోవద్దు. కోరికలులేని కర్మను చేయండి అనిచెప్పాడు. కోరికలులేని కర్మను చేయటంవలన మనస్సు అణుగుతుంది, ఇంద్రియాలకు నిర్మలత్వంవస్తుంది, బుద్ధియొక్క స్థాయిపెరుగుతుంది, మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి కలిగితే మీకు ముముక్షత్వంవస్తుంది. మనస్సు అలాఅని, ఇలాఅని ఆలోచిస్తుంది. నిర్ణయించేది మటుకు బుద్ధి. బుద్ధికూడా ప్రకృతిలోభాగమే. భగవంతుడు మనకు తెలివినిఇస్తే దానిని సద్వినియోగంచేసుకోవాలి. శరీరంకంటే ఇంద్రియములుగొప్పవి, ఇంద్రియములకంటే మనస్సుగొప్పది, మనస్సుకంటే బుద్ధిగొప్పది, బుద్ధికంటే నీహృదయంలోఉన్న చైతన్యం గొప్పది అని భగవంతుడుచెప్పాడు. ఈసృష్టిలోఅంతా నాకు సమానమేఅని చెపుతూ ఒకోసారి నీవుఅంటే నాకు ఇష్టం అర్జునాఅని పరమాత్మచెపుతాడు. ఈ సృష్టిలోఅంతా నాకు సమానమే అంటే అది పరమసత్యం. మనం కృష్ణుడిని ఒకదేహంగా చూస్తున్నాముకాబట్టి మనకు సపోర్టుఇవ్వటంకోసం, మనకు అర్ధమవ్వటంకోసం ఆ కోణంలో నీవు అంటే నాకు ఇష్టం అర్జునాఅని చెపుతాడుగాని అది పరమసత్యంకాదు. చిత్తశుద్ధిఉన్నవాడికి జ్ఞానియొక్క అనుగ్రహాన్ని స్వీకరించేఅర్హత, విషయాన్నిగ్రహించేశక్తి ఉంటుందికాబట్టి వాడిని చూసేటప్పటికి జ్ఞానికికూడా





ప్రత్యేకంగా ఒకరకమైన పొంగు వస్తూఉంటుంది. గీత ఒక్క అర్జునిడికేకాదు, అర్జునుడిని నిమిత్తమాత్రంగా పెట్టుకొని జీవకోటికి అందరికీ పరమాత్మచెప్పాడు. ప్రతీరోజూ గీతలోని కొన్నిశ్లోకాలుఅయినా చదవటం మంచిది.

రాగం, భయం, కోపం ఎక్కువగాఉంటే నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. ఏకారణంవలన నీమనస్సు బాహ్యముఖమవుతోందో ఆకారణాలను బయటకులాగి, మంటపెట్టు. అదేసాధన. ఈశ్వరుడులేకుండా జీవుడులేడు, ఈసృష్టిలేదు. భగవంతుడు ఆజ్ఞప్రకారం ఈసృష్టిలో ప్రతీదీ జరుగుతూఉంటుంది. ఇది నోటితో చెపుతున్నాముకాని హృదయంలోమనకు అనుభవంలేదు. నీవు ఏదిచెపుతున్నావో అదిఅయ్యిచెప్పు, దానికి సంబంధించిన అనుభవంపొందిచెప్పు. భగవంతుడికి తెలియకుండా ఏదీజరగటంలేదు. అందరి శరీరాలలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు. ఆయన నీకు తెలియకపోయినా నీమనస్సు నీకుతెలుస్తోందికదా. ఆ మనస్సుయొక్క మూలంలోనే ప్రభువు ఉన్నాడు. చిన్నచిన్న ఆనందాలకు, ప్రకృతి ఆనందాలకు పొంగిపోకు. శాశ్వతానందంవైపుకు, శాశ్వతశాంతివైపుకు నీకళ్ళు తెరువు. చిల్లరగొడవలలోనికివెళ్ళకు. చిన్నచిన్నసంతోషాలతో మీమనస్సును సంతృప్తిపరచుకొంటున్నారు. ఇక్కడఆగిపోవద్దు. శాశ్వతానందంవైపుకు నీకళ్ళుతెరువు. కొంతమంది ఐకమత్యంకోసం ప్రయత్నంచేస్తూఉంటారు, కొంతమంది కలహాలుపెడుతూఉంటారు. ఇదిఅంతా భగవంతుడికి తెలియదా? అంతా భగవంతుడికి తెలుసు. వాడిని అక్కడ ఎందుకు అలా పెట్టాడో భగవంతుడికి తెలుసు. అందుచేత ఆ మాయలో పడవద్దు. సమబుద్ధిని ప్రాక్టీసుచెయ్యి. ఆ మనిషిని దేవుడు ఎందుకు నియమించాడో వాడు ఆపనిచేస్తూఉంటాడు. నీవు వెళ్ళి ఆవలలో పడవద్దు. మనుషులలోఉన్న వికారాలలో నీవుకూరుకొనిపోవద్దు. ఆ వికారములనుండి, ద్వైతభావాలనుండి ఎగిరిపైకివెళ్ళు. నిన్ను ఎవరైనా స్తోత్రంచేస్తూఉంటే పొంగిపోకు, అక్కడ బంధంపెట్టుకోవద్దు. నిన్ను ఎవరైనా విమర్శిస్తూఉంటే అక్కడద్వేషంపెట్టుకోవద్దు. వాడిమీద ద్వేషంపెట్టుకొంటే అక్కడ ఆగిపోతావు. వాడు నిన్ను ద్వేషిస్తున్నాడుఅని ఈశ్వరుడికి తెలియదా? అంటున్నాడు పరమాత్మ. నిన్ను పొగిడేవారిని పెడతాడు, నిన్ను విమర్శించేవారిని పెడతాడు. వీటిని తట్టుకొనేశక్తిఉందో, లేదో ఈశ్వరుడుచూస్తూఉంటాడు. నీవు ఆగొడవలనుండి బయటకురా, మోక్షస్థితినిపొందు. ఇప్పడు నేనుచనిపోయానుఅనుకోండి. మీరుఅందరూఉంటారు, కేశవరంఉంటుంది,

పంచభూతాలు ఉంటాయి, సూర్యుడు ఉదయిస్తూఉంటాడు. నేను చనిపోవటంఅంటే నాకు సంబంధించిన శరీరం, నాకుసంబంధించిన ప్రపంచంకనబడకుండాపోతాయి. ఇక్కడ నాకు ఏదైనా ఆస్తులుఉంటే నా శరీరంపోయినతరువాత వాటిని అనుభవించటానికివీలుకాదు. నా శరీరంపోయినప్పుడు ఈ ప్రపంచంపోదు, నాకు సంబంధించిన ప్రపంచంఅంతా అదృశ్యమైపోతుంది. జరాసంధుడుఅనేకసార్లు యుద్ధానికివచ్చినా కృష్ణుడు ఊరకున్నాడు. ఎందుచేతనంటే జరాసంధుని భీమునిచేత చంపించాలి. అందువలన ఓర్పుగాఉన్నాడు, తొందరపడలేదు. సాధనలో ముందుకువెళ్ళాలి అనుకొన్నప్పుడు మనకు ఇప్పుడు ఉన్న సహనంసరిపోదు, ఓర్పుసరిపోదు, ధైర్యంసరిపోదు. ఇప్పుడు మనకు ఎంతోకొంత సహనంఉందికాని అదిసరిపోదు, మనకు ఎంతోకొంత ధైర్యంఉందికాని అదిసరిపోదు, మనం గమ్యం చేరుకోవటానికి చాలా సహనం అవసరం, చాలా ఓర్పు అవసరం, చాలాధైర్యంఅవసరం.

లోకంలో అనేకరకాల మనుషులు ఉంటారు, ఆ మనుషులయొక్క వలలోపడకు అందరిలో ఈశ్వరుడుఉన్నాడు. ఆయన నిర్మలంగా, నిరాడంబరంగా పనిచేస్తున్నాడు. వాడికి ప్రచారంఅక్కరలేదు. దేహంతో తాదాప్యంపొందేనేనుకు ప్రచారంకావాలి. దేహంతో తాదాప్యంపొందేనేనును తీసి ఒకప్రక్కనపెట్టకపోతే మీరు కోటిజన్మలుఎత్తినా మీకు మోక్షంరాదు. ఈ మిధ్యానేనును అక్కడపెట్టుకొని మీరు ఏదైనా మంచిపనులుచేస్తే పుణ్యంవస్తుంది అది అనుభవిస్తేపోతుంది. అందువలన చిల్లరగొడవలదగ్గర ఆగిపోవద్దు, లోపలకువెళ్ళు. సుఖం, శాంతి బయటలేవు నీలోపలేఉన్నాయి. నీకు శాశ్వతమైన ఆనందం, శాశ్వతమైన శాంతికావాలంటే నీలోపలున్న ఈశ్వరుడినిపట్టుకో. అప్పడు నిత్యసుఖానికి, నిత్యశాంతికి, శాశ్వతమైన ఆనందానికి వారసుడవుతావు. ఎప్పుడూ రానిచుట్టాలువస్తే ఎంతకాలానికివచ్చారు, మాజీవితం ధన్యమైపోతుందిఅని కొంతమంది అంటారు. ఏమి ధన్యమైపోయింది? వాడు ఒకగంట ఉంటాడు, తరువాతపోతాడు. ఎప్పుడైతే కలయికవచ్చిందో అప్పడు విడిపోవటంతప్పదు. మీఇంటిలోనివారు ఎవరైనా చనిపోతే వారు ఎక్కడో మిమ్మల్ని తలపెట్టుకొంటూ కూర్చొన్నారు అనుకోవద్దు. వారు వెంటనే మిమ్మల్ని మర్చిపోతారు, వారి వాసనలనుబట్టి వారుపోతారు. ఈ జీవుడి గొడవనీకుఎందుకు. అందరిహృదయాలలో అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు. నీహృదయంలోకూడా ఉన్నాడు. వాడు నిన్ను నియమిస్తున్నాడు. వాడినిచూడు. నీవు





పునర్జన్మనుండి విడుదలపొందుతావు. నీలోపల ఉన్న ఈశ్వరుడికి పూర్ణశరణాగతిచెందు. పూర్ణశరణాగతిలేకుండా సంపూర్ణమైన ఆనందం, సంపూర్ణమైనశాంతి నీచేతికి అందదుఅన్నారు భగవాన్. మనం ఒక అడుగులోపలకువేస్తే, లోపల ఉన్న భగవంతుడు తొమ్మిది అడుగులు ముందుకువచ్చి మనలను గుహలోనికి మోసుకొనిపోతాడు. మనకు గుడిలోఉన్న దేవుడిమీద నమ్మకంఉందిగాని హృదయంలోఉన్న దేవునిమీద మనకు నమ్మకంలేదు, కనీసం గుర్తింపుకూడాలేదు. మనం ఒక మహర్షిప్రక్కన కూర్చోవచ్చు. కాని లోపల ఆయనకు మనకు ఎంతదూరమో? శరీరాలు ప్రక్కప్రక్కనే ఉన్నా లోపల చైతన్యస్థాయిలో ఆయన ఎక్కడ ఉన్నాడో? మనం ఎక్కడఉన్నామో? ఆయన మన మాటకు, మనస్సుకు అందడు. మాట, మనస్సు అణిగినచోట ఆయన తెలియబడతాడు.

భౌతికంగాకూడా మనం పనులు నెరవేర్చుకోవటానికి ఎన్నోరకాల ప్రయత్నాలు చేస్తాము. ఎలక్షన్‌లో నెగ్గాలనుకొన్నప్పడు చూడండి మనం అనేకరకాల ప్రయత్నాలుచేస్తాము. ఓట్లు సంపాదించటంకోసం ఇంటింటికి తిరుగుతాము, ఊరేగింపులుపెడతారు, ప్రోగ్రాములుపెడతారు ఇలా రకరకాల ప్రయత్నాలు చేస్తారు. అలాగే బ్రహ్మానుభవంపొందటానికి నీవు పూజచెయ్యి, జపంచెయ్యి, ధ్యానంచెయ్యి, విచారణచెయ్యి, నిష్కామకర్మచెయ్యి, నీతంటాలు నీవుపడు, కాని బ్రహ్మానుభవంపొందు అప్పటివరకు ప్రయత్నం మానవద్దు. పూర్వం జిన్నూరులో ఒకపంతులుగారు అనేవారు పూర్వజన్మలోనేనుచేసిన పాపం నాపెద్దకొడుకు రూపంలోవచ్చింది అనిచెప్పేవారు. ఆకొడుకును తిట్టేవారుకాదు. నేనుచేసినపాపం వాడిరూపంలో వచ్చి నన్ను బాధపెడుతోంది వాడిని అనుకోవటం ఎందుకు అనేవారు. ఇది right attitude. ఈ right attitude మనలో ఎంతమందికి ఉంది? ఆయనకు జీవితంపట్ల సరియైన అవగాహనుంది కాబట్టి ఆయనకు బాధలేదు. గీత చాలామంది చదువుతున్నారు, వింటున్నారు కాని ఆచరించేవారు ఉండాలికదా అని కొంతమందిఅంటూఉంటారు. ఎవరిగొడవో నీకుఎందుకు. నీవు ఆచరించవచ్చుకదా. నీగొడవవదిలేసి ఇతరులగొడవలలోనికి వెళతావు ఎందుకు? అదే మాయ. మనస్సు ఏదైనా ఆనందం మనకు ఇచ్చినా అది తాత్కాలికం. మనోమూలంలోనికి వెళితే మీరుపోరు, మీరుఎవరో మీకుతెలుస్తుంది. మీరుఎవరో మీకుతెలిసాక అది ఉండటంవలననే అది తెలియబడుతుంది, దానిని అదే ఎంజాయ్‌చేస్తూ ఉంటుంది. మీ ఎంజాయ్‌మెంటుకు ఏమీ ఇబ్బందిలేదు. అప్పడు

ఆనందమే ఆనందం, శాంతేశాంతి, ఎటుచూసిన ఆనందమే. అక్కడ అహంభావన ఉండనక్కరలేదు. అక్కడ ఒకడు ఉన్నాడు వాడిని వాడే ఎంజాయ్‌చేస్తూఉంటాడు, అది పెర్మనెంట్‌గా ఉంటుంది. అహంభావనను అక్కడపెడితే ఇది మరల తాత్కాలికమైన ఆనందాలు తీసుకొనివస్తుంది.

కొంతమందికి అనుకొన్న పనులుఅన్నీ అయిపోతూఉంటాయి. అప్పడు మారోజులు బాగావెళ్ళిపోతున్నాయిఅంటారు. దానివలన ప్రమాదంఉంది. అనుకొన్న పనులుఅన్నీ జరిగిపోతూఉంటే మీకు తెలియకుండా గర్వం వస్తుంది. ఆపనులద్వారా సాధించినది మీ శరీరం మరణించాక ఇక్కడేఉంటుందికాని గర్వంమీకూడా వచ్చేస్తుంది. అందువలన అవివేకం పనికిరాదు, అశ్రద్ధపనికిరాదు, అవినయంపనికిరాదు. ఇద్దరు స్నేహితులుకలిసి ప్రయానంచేస్తున్నారు. రోడ్డుప్రక్కన వారికి మామిడిచెట్టు కనిపించింది. ఒకడు వెళ్ళి మామిడిపండు కోసుకొని తిని వెళ్ళిపోయాడు. రెండోవాడు ఈ చెట్టుకు ఎంతవయస్సుఉంటుంది, ఎన్ని ఆకులు ఉన్నాయి, ఎన్ని కాయలు ఉన్నాయి అని లెక్కలు వేస్తున్నాడు. ఇంతలో యాజమానివచ్చాడు. పండుకోసుకొని తిన్నవాడు వెళ్ళిపోయాడు. యజమాని ఇక్కడున్నవాడిని పుట్టకొనికొట్టాడు. వీడు పండుతినలేదు, లెక్కలువేస్తున్నాడు. పండువాడికి, దెబ్బలువీడికి. మన పనికూడా అలాగేఉంది. కొంతమంది ఏగొడవలుపెట్టుకోరు, వచ్చినపనిచూసుకొంటారు, తరిస్తారు వెళ్ళిపోతారు. మనం ఎంతసేపు ఈలోకం గొడవలలోఉంటాము. ఈలోపుగా యముడువస్తాడు తీసుకొనిపోతాడు. భగవంతుడు మాయకు అధిపతి. భగవంతుని పాదాలను ఆశ్రయించండి అప్పడు మాయ ప్రక్కకు తప్పకొంటుంది. నా పాదాలను ఆశ్రయిస్తే, నా నామాన్ని స్మరిస్తే ఈ సంసార సముద్రంఅంతా నీకు మోకాలులోతే ఉంటుంది, దానిని మీరు అతిక్రమించి బయటకుపోవచ్చు. అని భగవంతుడు చెపుతున్నాడు. మనం నిజంగాలేము. కాని ఉన్నాముఅని అనుకొంటున్నాము. అక్కడనుండి సాధనలు ప్రారంభమవుతున్నాయి. నీవులేవుఅన్నసంగతి నీకుతెలిస్తే ఏమీలేదు. మీరుజీవితంపొడుగునా చేయవలసిన కృషిఏమిటిఅంటే దేహాభిమానాన్ని ఆరోజుకారోజు తగ్గించుకొంటూ రావాలి. మనం సుఖంవచ్చినప్పడు ఒకరకంగాఉంటాము, దుఃఖంవచ్చినప్పడు ఒకరకంగాఉంటాము. గౌరవంవచ్చిప్పడు ఒకరకంగాఉంటాము, అగౌరవంవచ్చినప్పడు ఒకరకంగాఉంటాము. ఇంటిలోనివారు ఎవరైనా చనిపోతే ఒకరకంగాఉంటాము, పుడితే ఒకరకంగాఉంటాము. ఇవిఅన్నీ సామాన్య మానవుడిని స్పందించేసూత్రాలు. ఈద్వంద్వాలను దాటివెళ్ళు. ఈద్వంద్వాలనుండి విడుదలపొందితే ఇంకనీకు జన్మఏమిటి?

ఒక శిష్యుడు గురువువద్ద భగవద్గీతనేర్చుకొంటున్నాడు ఒకసారి గురువుగారికి కోపంవచ్చి శిష్యుడిని చివాట్లు పెట్టాడట. మీరు కఠినంగా మాట్లాడారు నేను వెళ్ళిపోతున్నానుఅనిచెప్పి శిష్యుడు వెళ్ళిపోవటానికి సిద్ధమయ్యాడు. అప్పడు గురువు శిష్యుడితో నీవు నాదగ్గర గీతను నేర్చుకొంటున్నావు. సమాజంలోనికి వెళ్ళి గీతను చెపుతాననంటున్నావు. నేను చిన్నమాట అంటేనే భరించలేకపోతున్నావు, దానిని ఇముడ్చుకోలేకపోతున్నావు, గీతను సమాజంలో కక్కుతావాఅన్నాడు. ఈచిన్నమాటను భరించలేనివాడవు, ఈనిందను భరించలేనివాడవు, ద్వంద్వాలనుండి బయటకురాలేనివాడవు ఇంకోజీవుడిని ద్వంద్వాలనుండి ఎలాబయటకు తీసుకొనిరాగలవు. ఈద్వంద్వాలనుండి బయటకురాకుండా నీకు ఆత్మజ్ఞానం ఎలాకలుగుతుంది. నేను చెప్పినవిద్యను అర్ధంచేసుకోకుండా అక్కడకువెళ్ళి, ఇక్కడకువెళ్ళి దానిని కక్కుతావాఅన్నాడు. ఎవడైతే ఆత్మయందు స్థిరంగాఉంటున్నాడో వాడికి పనిచేయటంవలన వచ్చే లాభంలేదు, చేయకపోవటంవలనవచ్చే నష్టంలేదు. ఓఅర్జునా! నేను పనిచేసి సాధించేది ఏదీలేదుకాని పనిచేస్తున్నాను. ఎందుచేతనంటే కృష్ణుడే పనిచేయలేదుఅని జీవకోటిపాడైపోతారుఅని పనిచేస్తున్నానుకాని, పనిచేసి నేను సంపాదించేదిఏదీలేదుఅని భగవంతుడు చెప్పాడు. జ్ఞానికి కర్తవ్యంఅంటూ ఏమీలేదు. ఈపనిచేయాలిఅని జ్ఞానిఅనుకోడు. వాడిద్వారా పనిజరుగుతూఉంటుంది. జ్ఞాని ఈశ్వరునిచేతిలో పనిముట్టగాఉంటాడు. నిజమైన సాధకుడు ఎలాఉంటాడుఅంటే వచ్చినదానిని చూసి పొంగిపోడు. రానిదానిగురించి బాధపడడు. ఎక్కడికక్కడ తృప్తిపడుతూఉంటాడు. అది సాధకుడి లక్షణం. నీవు ఎవరికి ఉద్రేకంకలిగించవద్దు. చేతనయితే వారి ఆలోచననుపెంచు. అరుపులు భక్తికాదు, ఉద్రేకంభక్తికాదు. ఎవరిని ఉద్రేకపరచవద్దు, వారికి సరియైన మార్గాన్ని చూపించు. ఎవరైనా నిన్ను ఉద్రేకపరచినా నీవుఉద్రేకపడవద్దు. అలా ఉద్రేకపడితే వారు పన్నిన మాయవలలోపడతావు. నీవు వివేకంను విడిచిపెట్టవద్దు, సమత్వమును విడిచిపెట్టవద్దు. నిన్నుచూసి ఎవరైనా ఈర్ష్యపడుతున్నా అదినీవు గుర్తించవద్దు. ఇతరులను ఎవడైతే ఉద్రేకపరచడో, ఇతరులు ఉద్రేకపరచినా ఎవడైతే ఉద్రేకపడడో, ఎవడికైతే ఈర్ష్యలేదో, ఎవడికైతే భయంలేదో, ఎవడైతే రాగద్వేషములులేకుండా ఉన్నాడో అట్టి భక్తుడు నా హృదయానికి సమీపంలోఉంటాడు,

వాడు నాకు ప్రియుడు అని భగవంతుడు చెపుతున్నాడు.

నన్నే స్మరించుకో, నాకు ఇష్టమైన పనులే చెయ్యి, నాగురించే మాట్లాడు అని ఇలాఎన్నో మెట్లు భగవంతుడుచెపుతున్నాడు. ఎక్కడోఒకచోట మనపిలకవాడు పట్టుకోవటంకోసం ఇలా ఎన్నో చెపుతున్నాడు. ఇలాకాకపోతే అలాచెయ్యి, అలాకాకపోతే ఇలాచెయ్యిఅని చెపుతున్నాడు ఎవడుచెపుతాడు మన ప్రేమికుడు తప్ప ఇలా ఎవడుచెపుతాడు. మనమీద పరిమితులులేని ప్రేమఉందికాబట్టి ఏదోరకంగా ఆయనలో ఐక్యంచేసుకోవటంకోసం ఇవిఅన్నీచెపుతున్నాడు. నీవునేనుఅణగ నిత్యానందమయముగ నిలుచుస్థితి కరుణింపు అరుణాచలా అన్నారు భగవాన్. నీవువేరు, నేనువేరుఅని బేదబుద్ధి ఉన్నప్పుడు హృదయంలోఉన్న ఆనందం నాచేతికి అందదు. అందుచేత నేనుఅణిగిపోతాను, నీవుకూడా అణిగిపో అప్పడు అద్వైతానుభవం కలుగుతుంది, హృదయంలోఉన్న ఆనందం నాచేతికి అందుతుంది.

**నీ కర్తవ్యం నీవు నిర్వహించడమే భగవంతునికి నిక్కమైన నమస్కారం. శ్రద్ధాభక్తులతో కర్తవ్య నిర్వహణకంటే ఉత్తమమైన భగవత్సేవ మరిలేదు. అట్లే, నీవు ఏది భుజించినా అహంకార వివర్జితుడవై భుజించు. అపుడు నీవు భుజించేది ప్రతిదీ భగవత్ప్రసాదమే అవుతుంది.**

**- భగవాన్ శ్రీ రమణ మహర్షి**





**ఓం నమోభగవతే శ్రీరమణాయ**

# రమణభాస్కర

**(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 26-12-01, కాపవరం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు గీతాజయంతి. భగవద్గీతకు అంతగొప్పతనం ఎందుకువచ్చిందిఅంటే భగవంతుడిని ఎలాపూజచేసుకోవాలి, ఎలాస్మరించుకోవాలిఅనే విషయము దగ్గర మొదలుపెట్టి మనోనాశనం ఎలాచేసుకోవాలి, మహావెలుగులోనికి ఎలా ప్రవేశించాలిఅనే విషయంవరకు ఎన్నో ఉపాయాలు, ఎన్నోసాధనలు క్రమంగా జీవకోటిమీద అపారమైన ప్రేమతో భగవంతుడు బోధించాడు. వేదాలసారం, ఉపనిషత్‌లసారం భగవద్గీత. ఉపనిషత్తులను ఆవుగాచేసుకొని కృష్ణుడు పాలుపితికి అర్జునుడికి పోసాడు అదే భగవద్గీత. ఆపాలు అర్జునుడుతాగాడు, మన పెద్దలు చాలామంది తాగారు, పాలుఇంకామిగిలి ఉన్నాయి మనంకూడా ఆపాలుతాగవచ్చు, తాగే ఓపికఉండాలి, జీర్ణంచేసుకొనే శక్తి మనకు ఉండాలి. మీరు అందరూ నావారే. ఈ ప్రపంచంఅంతా ఒకలీల. నా స్వరూపంమీకు తెలిసేవరకూ, చైతన్యంలో మీరు ఐక్యంఅయ్యేవరకూ మిమ్మల్ని విడిచిపెట్టను. మేము మట్టివాళ్లముఅని మీరు అనుకొంటున్నారు మీరు మట్టివాళ్ళుకాదు, మీరు ప్రకృతివాళ్ళుకాదు, మీరు నావారుఅని భగవంతుడు చెపుతున్నాడు. మీ ముక్కులోగాలి తిరుగుతున్నంతవరకు మీరు యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దుఅని భగవంతుడు చెప్పాడు. స్వార్థంలేకుండా మీరు ఏపనిచేసినా అది యజ్ఞంతో సమానము. దానంఅంటే కేవలం డబ్బుఇవ్వటం మాత్రమే దానంఅనుకోవద్దు, నీవు మాటసహకారంచేసినా అది దానంతోసమానము. దానంప్రీతితో, ప్రేమతోచేయాలి. పునర్జన్మ కారణములు మనస్సులోఉన్నాయి. ఆమనస్సును ఎండింపచేయటం తపస్సు. చేప నీటిప్రవాహమునకు ఎదురుఈదుతుంది అలాగే నీవు మనోప్రవాహమునకు ఎదురుఈదు. అప్పడు మనోమూలంలోనికి వెళతావు. అప్పడు ఆనందమేఆనందం, శాంతేశాంతి. మనోమూలంలోనికి వెళితే మనలను మనం పోగొట్టుకొంటామేమోఅని చాలామందికి భయం. మనలను మనం పోగొట్టుకోము, మనం ఎవరోమనకు తెలుస్తుంది, భగవంతుడు మనకు

స్వరూపంగా వ్యక్తమవుతాడు.

కామంఅంటే కోరిక. నీమనస్సు ఎక్కడికివెళ్ళివాలుతోందో అక్కడ కోరికఉందిఅనిఅర్థం. మనకు అనేకరకాలభయాలు. ఏదో ఆశించిపనిచేస్తాము అది నెరవేరదేమోఅనిభయం. ఏదోపదవి ఆశిస్తాము అదిరాదేమోఅనిభయం. మానవుడికి ఆత్మానుభవం కలిగేవరకూ ఏదోరకమైన భయం వెంటాడుతూఉంటుంది. భయంఎక్కడుంది. భయంమనస్సులోఉంది. మనస్సు నశిస్తే భయంనశిస్తుంది. మనస్సు ఎలానశిస్తుందిఅంటే పూర్ణశరణాగతివలన మనస్సు నశిస్తుంది. మీరు 90 వంతులు శరణాగతిచేసి 10 వంతులు చేయలేదుఅనుకోండి ఆ 10 వంతులు భయం మీకూడా వచ్చేస్తుంది. అందువలన పూర్ణశరణాగతి అవసరం. ఎవరికైనా మీమీద అసూయఉంటే వారు మిమ్మల్ని ఏదోరకంగా విమర్శిస్తూఉంటారు. వారు అసూయపడుతున్నారుఅని తెలిసినా మీరు అసూయపడవద్దు. అసూయపడుతూఉంటే శరణాగతియొక్క వేగం తగ్గిపోతుంది. భగవంతుడు ఒకడు ఉన్నాడు. వాడికి తెలియకుండా ఈసృష్టిలో ఏమీజరగటంలేదుఅని పరిపూర్ణమైన విశ్వాసంఉన్నవాడికి శరణాగతి కుదురుతుంది, విశ్వాసంలేనివాడికి శరణాగతి కుదరదు. మీ విశ్వాసంలో ఎంతవెలితిఉంటే అంతభయం మీకూడా వచ్చేస్తుంది. మోక్షం సంపాదించాలిఅని ఏదో ఆదర్శంపెట్టుకొని మనం ప్రయత్నంచేస్తూఉంటాము. లోకంలో అందరికి మోక్షం సంపాదించాలిఅని ఉంటుందా? ఉండదు. వారు మిమ్మల్ని విమర్శిస్తూఉంటారు. అప్పడు కంగారుపడి భగవంతుడిని వదిలివేస్తే మరల వెనుకకు వెళ్ళిపోతారు. కొంతమంది లోకప్రయోజనాలకోసం భగవంతుడిని నమ్ముతారు. కొంతమంది ఎలా ఉంటారుఅంటే నీవు సృష్టించిన ఈలోకం మాకు అక్కరలేదు, నీవే మాకుకావాలి అంటారు. వారు ఉత్తమ భక్తులు.

కాకినాడనుండి వచ్చిన ఒకరు భగవాన్‌తో ఆశ్రమంలో ఈపొరపాట్లుఉన్నాయి మీరు వాటిని సవరించాలిఅని చెపుతాడు. అప్పడు భగవాన్ అతనితోనీవు ఎక్కడనుండి వచ్చావుఅని అడిగారు. నేను కాకినాడనుండి వచ్చానుఅని చెప్పాడు. పొరపాట్లు సవరించటానికి కాకినాడనుండి అరుణాచలం రావటం ఎందుకు? కాకినాడలో పొరపాట్లు లేవా అక్కడే పొరపాట్లు సవరించుకో. ఇంతదూరం రావటం ఎందుకు? నీవు ఏపనిమీద ఇక్కడకు వచ్చావో ఆపనిచూసుకో. ఇక్కడ పొరపాట్లు గొడవనీకుఎందుకు? దాని అర్థం ఏమిటిఅంటే మనం ఈభూమిమీదకు ఎందుకువచ్చామో ఆపనిమర్చిపోకూడదు. వచ్చిన పనిమర్చిపోకూడదు. ఆపనినెరవేర్చుకోవటంకోసం నీశరీరాన్ని, మనస్సును, ఇంద్రియాలను వీలైనంతగా ఉపయోగించుకోవాలి. బ్రహ్మానుభవంపొందటానికి నీశరీరాన్ని, మనస్సును, పరిసరాలను, మహాత్ములను అందరిని ఉపయోగించుకోవాలి. మనకు భక్తిలేదుఅనికాదు, విశ్వాసంలేదుఅనికాదు. ఎంత ఉండాలోఅంతలేదు. పూర్తివిశ్వాసంఉన్నవాడు మాత్రమే భయంనుండి విడుదలపొందుతాడు. రాగము, భయము, కోపము వీటిని విడిచిపెట్టమని భగవంతుడుచెప్పాడు. రాగకారణం ఉన్నప్పటికి మీరు రాగంలేకుండాఉంటే, భయకారణం ఉన్నప్పటికి మీరు భయంలేకుండాఉంటే, మీరుకోపం తెచ్చుకొనేకారణం ఉన్నప్పటికి కోపంలేకుండాఉంటే సడన్‌గా భగవంతుని దయమీమీద వర్షిస్తుంది, మీకు అమృతానుభవం కలుగుతుంది. మీఇంటిలోని బంగారాన్ని, విలువైన వస్తువులను ఎలాజాగ్రత్తగా చూసుకొంటున్నారో, వాటిని ఎలా దాచుకొంటున్నారో అలాగ భగవద్గీతలో భగవంతుడు చెప్పిన విషయాలను, వాటిసారాన్ని అంతవిలువగా చూసుకొని మీహృదయంలోదాచుకోండి. భగవద్గీతమీద ప్రేమఉంటే, గౌరవంఉంటే దానిహృదయాన్ని మనకు ఇస్తుంది. గీతలో ప్రతిశ్లోకంలో నేను ఉన్నాను, నీవు భయపడవద్దుఅని ఎక్కడికక్కడ భగవంతుడు మనకు సపోర్టుఇస్తూఉంటాడు. దేహం నిలబడటానికి ఆహారం ఎటువంటిదో, మనజీవుడు బాగుపడటానికి గీతలోశ్లోకాలు అటువంటివి. తిలక్‌గారిని చాలాకాలం జైలులోపెట్టారు. మనలను జైలులోపెడితే ఏడుస్తూకూర్చొంటాము. కాని తిలక్‌గారు ఏమనుకొన్నారుఅంటే ఇది భగవంతుడు నాకు ఇచ్చిన అవకాశంఅనుకొని భగవద్గీతకు వ్యాఖ్యానంవ్రాసారు. కొంతమంది చెడ్డనుకూడా మంచికి ఉపయోగించుకొంటారు. ఆయన జైలునుకూడా అనుకూలంగా త్రిప్పకొన్నారు. అది పోజిటివ్ తింకింగ్.

నీకు పనిచేయటానికే అధికారంఉంది. నీవు విసుగులేకుండా పనిచెయ్యి, కపటంలేకుండా పనిచెయ్యి. హృదయపూర్వకంగా పనిచెయ్యి. ప్రచారంకోసం పనిచేయవద్దు. మనకు కావలసింది ప్రచారంకాదు, పవిత్రతకావాలి. పవిత్రుడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనం పవిత్రులంఅవ్వటానికి జీవితంపొడుగునా కృషిచెయ్యాలి. మానవస్వభావం అత్యంత బలీయమైనది. స్వభావాన్ని మార్చుకోవటం చాలాకష్టం, దానికి ఎంతోపోరాటం అవసరం.

స్వభావాన్ని మార్చుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి అదేసాధన. కర్మఫలంమీద నీకు అధికారంలేదు. నీచేతిలోఉన్నపనిని శ్రద్ధగాచెయ్యి. కర్మఫలంవస్తే గర్వపడకు, కర్మఫలం రాకపోతే కృంగిపోకు. గర్వపడటం ఒకవికారం, కృంగిపోవటం ఒకవికారం, రెండూచెడ్డే. ఫలంవచ్చినా రాకపోయినా సమానంగాఉండు. మనంఅనుకొన్న పనిఅయినప్పడు ఒకలాగ, పనిఅవ్వకపోతే ఒకలాగ ఉండవద్దు. అలాఉంటే అజ్ఞానంలోకూరుకొనిపోతావు. ఫలం ఆశించి కర్మనుచేయవద్దు. కోరికతో ఫలంతెచ్చుకొంటే అది నిన్ను బంధిస్తుంది. బంధంవలన భ్రాంతివస్తుంది. భ్రాంతివలన వేలాది శరీరాలు మోయవలసివస్తుంది. ఫలాపేక్షలేకుండా కర్మనుచేస్తే ఫలంవచ్చినా రాకపోయినా మనస్సు నశిస్తుంది. కర్మఫలాన్ని ఆశించవద్దుఅని చెపుతున్నానుకదా అని మొత్తానికి కర్మను విడిచిపెట్టవద్దు. ముసలమ్మగారిమెడలో గొలుసుగురించి ఆశపడవద్దుఅని చెపుతున్నానుకదాఅని ముసలమ్మగారిని చూడటం మానవద్దు. ఆవిడఇస్తే పుచ్చుకోండి, లేకపోతే లేదు. గొలుసు గురించి ఆశపడవద్దు. ముసలమ్మగారిలో ఉన్న జీవుడుఎవడు? వాడు నావాడు అది మర్చిపోవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. ఆ జీవరూపంలోనేను ఉన్నాను. ఆ జీవుడికి సేవచేస్తే నాఅనుగ్రహాన్ని పొందుతావు.

రాగద్వేషములనుండి ఎవడైతే విడుదలపొందాడో వాడికి ఎటుచూసినా ఆనందమే, ఏలోకానికివెళ్ళినా ఆనందమే. అందువలన రాగద్వేషములమధ్య కూర్చోవద్దు. వాటినుండి విడుదలపొందు. లోపలకువెళ్ళు. మనస్సు ఎక్కడనుండి వస్తోందో అక్కడకువెళ్ళు. భగవంతుడు నీకు ప్రత్యక్షమయ్యి వెయ్యి జన్మలదాకా నీకు మోక్షం ఇవ్వనుఅంటాడుఅనుకో.

**కామాది అరిషడ్వర్గాన్ని ఎలా నిగ్రహించడం? ఈ ఉద్వేగాలు ఎవరివో కనుక్కో. నీవు ఆత్మస్థుడవై ఉండగలిగితే ఆత్మకంటే వేరుగా నీకేదీ కనిపించదు. అప్పుడు నిగ్రహించడమనే ప్రసక్తికే అవకాశం వుండదు.**

**- భగవాన్ శ్రీ రమణ మహర్షి**

20-01-2002



వెయ్యిజన్మలవరకురాదా అని కృంగిపోవద్దు. వెయ్యిజన్మల తరువాతఅయినా మోక్షంఇస్తావుకదా ప్రభువాఅని సంతోషిస్తే ఈజన్మలోనే ఇచ్చేస్తాడు. నీ మనస్సు ఎంతవరకు ప్రిపేర్అవుతోందో చూస్తూఉంటాడు. కంగారుపడవద్దు. కొంచంకొంచంగా మంచిచేసుకొంటూవెళ్ళు. నీలోఉన్న బలహీనతలు నెమ్మదిగానశిస్తాయి. అప్పడు భగవంతుని అనుగ్రహానికి పాత్రుడవుఅవుతావు. ఆయన అనుగ్రహానికి పాత్రుడవు అయిన వెంటనే ఆయన స్వరూపాన్ని నీకుఇస్తాడు. ఇదిఅంతా ఒక్కరోజులో చేసాయాలిఅని అనుకోవద్దు. నెమ్మదిగాచేసుకొంటూవెళ్ళు. చేసేపని ధైర్యంగాచెయ్యి, ఆత్మవిశ్వాసంతోచెయ్యి. ఎవరో విమర్శిస్తున్నారుఅని కంగారుపడవద్దు. అది పిరికితనం, నీవు ధైర్యాన్ని విడిచిపెట్టవద్దు, సహనాన్ని విడిచిపెట్టవద్దు. నీవు సహనంగాఉంటే, ధైర్యంగాఉంటే, శాంతిగాఉంటే సమాజంతోకూడా ఆనందంగా ఉండగలవు.

నీమనస్సు ఇప్పడు విషయాలమీద వాలుతోంది. నెమ్మదిగా ఆ విషయాలనుండి నీమనస్సును మరలించి నాయందు నిలబెట్టుఅని భగవంతుడు చెపుతున్నాడు. ఇతర చింతలులేకుండా ఎవడైతే నన్నే ప్రేమిస్తున్నాడో వాడు అనన్యప్రేమికుడు. వాడు నాకుభక్తుడు. అందరి హృదయాలలో అంతర్యామిగానేనుఉన్నాను. అందరిలోఉన్న నన్ను ఎవడైతే చూస్తున్నాడో వాడు నిజమైన చూపుగలవాడు, మిగిలినవారు దొంగచూపుకలవారు. మనలో అంతర్యామిగాఉన్నభగవంతుడిని వదిలేసి మనలోఉన్న వికారములనుచూస్తూఉంటే వాడు దొంగచూపు కలవాడు. నీవికారం నీవుకాదు. నీతలంపునీవుకాదు. నీమనస్సునీవుకాదు. నీవుచింతించే విషయాలు నీవుకాదు. నీహృదయంలో అంతర్యామిగా ఒకడు ఉన్నాడు. వాడిని చూడటంనేర్చుకో. నిరంతరం నన్నే స్మరించేవారి యోగక్షేమములను నేనుచూస్తానుఅని భగవంతుడుచెపుతున్నాడు. యోగక్షేమాలు అంటే లేనిదిఇస్తాను, ఉన్నదికాపాడుతానుఅని చెప్పటం. కాని ఇక్కడ ఒక ప్రమాదంఉంది ఆయన ఇస్తానుఅన్నాడుకదాఅని యోగక్షేమాలను మనం కోరుకొంటే మరల ప్రకృతిలోనికి వచ్చేస్తాము. ఆయనఇస్తే పుచ్చుకోవచ్చు కాని వాటిని మనం కోరుకొంటే బంధంలోపడతాము. కృష్ణుడికి వెన్నదొంగఅనిపేరు. మన మనస్సును వెన్నలాగ చేసుకొంటే ఆయన దొంగతనంచేసి పట్టుకొనిపోతాడు, ఆయన స్వరూపం మనకుఇస్తాడు. అంటే అప్పడు మనస్సు పీడపోతుంది. లోపలఉన్నఆనందం మనకు వ్యక్తమవుతుంది.

**రమణ భాస్కర**

**ఓం నమో భగవతే శ్రీరమణాయ**

# రమణభాస్కర

**(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 25-12-01, కొవ్వాడ)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

షిర్డీబాబాగారు ఎక్కువగా రెండుమాటలు చెప్పేవారు 1. శ్రద్ధ, 2. సహనం. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే శ్రద్ధ, సహనం చాలా ముఖ్యం. శ్రద్ధ లేకపోతే జీవితంలో ఏదీ సాధించలేము. శ్రద్ధ ఆత్మవిశ్వాసమును పెంచుతుంది. శ్రద్ధవలన చిన్నపనినికూడా సమగ్రంగా చేయగలుగుతాము. శ్రద్ధవలన జ్ఞానంకలుగుతుంది. సహనంవలన హృదయంయొక్క లోతులు పెరుగుతాయి. సహనంఉన్న వ్యక్తిద్వారా సమాజమునకు శాంతి, కాంతి అందుతుంది. సహనంను నెమ్మదిగా ప్రాక్టీసు చేస్తూఉంటే మనస్సుకు కంట్రోలువస్తుంది. అందువలన శ్రద్ధ, సహనం వీటిని జీవితంపొడుగునా కాపాడుకొంటూ రావాలి. శరీరం భౌతికమైనఅగ్నికి ఆహుతిఅవ్వకముందే మన రాగద్వేషములు జ్ఞానాగ్నికి ఆహుతిఅవ్వాలి. ఎవడైతే శరీరంఉండగానే తన అహంవృత్తిని జ్ఞానాగ్నిలో కాల్చి బూడిదచేసుకొన్నాడో వాడికి మాత్రమే బ్రహ్మజ్ఞానం అనుభవంలోనికి వస్తుంది. మనకు ఎంతచదువుఉన్నా, ధనంఉన్నా, అధికారంఉన్నా ఈశ్వరుడి అనుగ్రహం లేకపోతే మనకు శాంతి, సుఖం, ఆనందంలేదు. ఆయన దయ అవసరం. అందువలన మీరు ఏపనిచేసినా ఈశ్వరుడి ప్రీతికోసం, ఈశ్వరుడిదయను పొందటంకోసం చేయండి. భక్తిపేరుమీద సోమరితనం పెరగకూడదు. ఎంతోకొంత సమాజమునకు సేవచేయటంద్వారా ఈశ్వరుని దయకు పాత్రులవుతాము. కంగారుపడవద్దు, నిదానంగా ముందుకు ప్రయాణంచేయండి. మనం ఎలాపనిచేస్తే, ఎలామాట్లాడితే, మనకు ఎటువంటి తలంపులువస్తే మరల మనం వెనక్కి తిరిగి చూడవలసిన పనిలేదో, మనం దుఃఖపడవలసిన పనిలేదో అలా పనిచేయండి, అలా మాట్లాడండి, అటువంటి తలంపులే మన బ్రెయిన్‌లోనికి రానివ్వాలి. ఇలా జీవించటంవలన భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతాము.

ఒక గురువుగారి దగ్గరకు ఒక భక్తుడువచ్చి నాకు ఆత్మజ్ఞానం గురించి బోధించండి అని అడిగాడు. అప్పడు అక్కడ హాలులో పదిమంది కూర్చొని ఉన్నారు. ఎవరూ లేనప్పడు రా





చెపుతాను అన్నారు గురువుగారు. ఆ భక్తుడు ఒకగంట తర్వాతవెళ్ళి గురువుగారితో అందరూ వెళ్ళిపోయారు. ఆత్మజ్ఞానం గురించి చెప్పటం ప్రారంభించండి అని అడిగాడు. అప్పడు గురువుగారు ఇక్కడ ఎవరూలేరా అని అడిగారు. ఎవరూలేరు నేను ఒక్కడినే ఉన్నాను అని చెప్పాడు. ఎవరూ లేనప్పడు కదా నీకు చెపుతానుఅని చెప్పింది, నేను ఉన్నాను అంటున్నావుకదా. ఆ నేనును పోగొట్టుకొనిరా అప్పడు చెపుతాను అన్నారు గురువుగారు. దానిఅర్థం ఏమిటిఅంటే ఆనేను ఉన్నంతకాలం, దేహాభిమానంఉన్నంతకాలం నీకు ఆత్మవిద్య గురించి చెప్పిన దానిగురించి నీకు తెలియదు, ఆవిద్య నీగుండెకు తాకదు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న భగవంతుడే తన భక్తుడిపట్ల జాలితో, భక్తుని పరిపక్వతనుబట్టి అతనికి బోధించి తరింపచేయటానికి ఒక రూపం ధరించివస్తాడు. ఆయనే గురువు. ఎన్నో సంస్కరణలుచేస్తూఉంటారు. కాని సంస్కరణలవలన మానవుడు దుఃఖంలోనుండి విడుదలపొందలేడు. ఎవడైతే దుఃఖాన్ని దాటివెళ్ళాడో వాడుమాత్రమే ఇతరులను దుఃఖంనుండి విడుదలచేయగలడు. అందువలన మహాత్ముల పాదాలను ఆశ్రయించి, వారిని ఆరాధించటంవలన వారు దుఃఖాన్ని దాటివెళ్ళారు కాబట్టి మనలనుకూడా వారిస్థాయికి మోసుకొనిపోతారు. కొంతమంది బాబాగారిని ఆశ్రయించవచ్చు, కొంతమంది భగవాన్‌ను ఆశ్రయించవచ్చు, కొంతమంది రామకృష్ణుడిని ఆశ్రయించవచ్చు. మనం ఏ పడవలో ప్రయాణం చేసినా నదినిదాటాలి. అలాగే మనం ఏ మహాత్ముడిని ఆశ్రయించిన ఈ దుఃఖసముద్రాన్ని దాటాలి. అదిముఖ్యం. జననమరణ ప్రవాహమునుండి విడుదలపొందటానికి ఎవడైతే మనకు సహాయసహకారములు అందిస్తున్నాడో వాడేగురువు. మనకు కావలసింది ప్రచారంకాదు, పవిత్రతకావాలి అది మర్చిపోవద్దు. చివరి శ్వాసవరకూ మనం పవిత్రులం అవ్వటానికి ప్రయత్నంచేస్తూనేఉండాలి. ప్రచారంవలన ఎవరికీ జ్ఞానంరాదు. పవిత్రతవలన జ్ఞానం కలుగుతుంది. ఆధ్యాత్మిక జీవితంలో పవిత్రత చాలాముఖ్యం. మనమనస్సు ప్రచారంమీదకు వెళుతూఉంటే పవిత్రత సాధించాలనే బుద్ధిపోతుంది. మీరు ఎంతచదువుకొని ఎన్ని డాక్టరేట్లు పుచ్చుకొన్నా, ఎంతపాండిత్యం సంపాదించినా మనస్సులో వికారములులేని స్థితిని పొందటం, రజోగుణం, తమోగుణాలను అతిక్రమించటం, ప్రకృతి గుణాలనుదాటి ప్రకృతిలేని స్థితిని పొందటం చాలాకష్టం. దానికి నీతెలివితేటలు సరిపోదు, నీసాధనసరిపోదు. ఈశ్వరానుగ్రహం లేకుండా వీటిని అతిక్రమించటం అసాధ్యం, దుస్సాధ్యంఅని చెప్పారు. స్వర్గరాజ్యం ఎక్కడోలేదు, నీహృదయంలోనేఉందిఅని జీసస్‌చెప్పారు. సాత్వికులు ధన్యులువారు స్వతంత్రించుకొందురు.

సత్వగుణం పెంచుకొంటే నీకు శాంతికలుగుతుంది, స్వేచ్ఛవస్తుంది. ప్రేమలేకుండా ఒకమనిషి ఇంకో మనిషిని అర్థంచేసుకోలేడు. ప్రేమలేని వ్యక్తికి హృదయంలోఉన్న ఈశ్వరుడుకూడా ఎరుకపడడు ఎందుచేతనంటే ఆయన ప్రేమస్వరూపుడు.

మనం అందరము దేహానికి ఎక్కువ ప్రాముఖ్యతఇచ్చి పొరపాటు చేస్తున్నాము. ఈ దేహమేఆత్మ, ఈదేహమేసర్వస్వంఅనుకొంటున్నాము. ఇంక మనకు లోచూపు ఎలాకలుగుతుంది. 24 గంటలు దేహాభిమానంతో కాలిపోయేవాడికి ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. ఈ దేహానికి ఆత్మకు ఎట్టి సంబంధంలేదుఅని దృఢమైన నిర్ణయం ముందు మనకు రావాలి. మన ఇంద్రియాలను, మనస్సును, దేహాన్ని, భగవంతుడు మనకు ఇచ్చిన అన్ని అవకాశములను భగవదనుభవం పొందటానికి ఉపయోగించుకోవాలి. మనం కొంచంకొంచెంగా మంచిని ఆచరిస్తూఉంటే ఆ మంచితనమే మనలో వికాసాన్ని తీసుకొనివస్తుంది. మంచితనమే జ్ఞానంఅన్నాడు సోక్రటీస్. ఇప్పుడు నేనుఅనేటప్పటికి నీమనస్సు, నీదేహంఎలా స్ఫురిస్తున్నామో అలాగే నేనుఅనేసరికి నీ హృదయంలోఉన్న చావులేని వస్తువు, బ్రహ్మం నీకు స్ఫురించాలి. అది నీ కడసారిజన్మ. ఆస్థితికి చేరటానికి, ఆస్ఫూర్తి నీకు రావటానికి భగవంతుడు ఇచ్చిన అవకాశములను మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి. భగవంతుడు మనహృదయంలోనేఉన్నాడుకాని మనకు తెలియటంలేదు. భగవంతుడు నీలోపలేఉన్నాడని మనకు బోధించి ఆయనతో అనుసంధానాన్ని కలుగజేసేవాడే గురువు. బాబా మాట్లాడే ప్రతీమాట దేవునితో సమానము కారణముఏమిటిఅంటే అది ఎవరో అహంకారాన్ని సంతృప్తిపరచటానికి చెప్పినమాటలుకాదు, ఎక్కడో హృదయాంతరాళములనుండి వస్తాయి. మన ఇంటికి చుట్టాలువస్తే అవసరం లేకపోయినా ఎక్కువగా మాట్లాడతాము లేకపోతే వారి అహంకారం సంతృప్తిపడదు. మనం చేసేపని ఏమిటిఅంటే ఒకరి అహంకారమును ఇంకొకరు సంతృప్తిపరచుకొంటూఉంటాము. ఈలోపు మరణంవస్తుంది, ఈశరీరాన్ని తీసుకొనివెళ్ళి స్మశానంలోపడేస్తారు, ఎక్కడో ఒకచోట పడేయాలికదా. అలాగని శరీరాన్ని నెగ్లెట్ చేయమనికాదు దానికి ఎంతవరకు విలువఇవ్వాలో అంతే ఇవ్వాలిగాని ఎక్కువ ప్రాముఖ్యత శరీరానికి ఇవ్వకూడదు. ఆకలివేస్తే అన్నంతిను, రోగంవస్తే మందులువేసుకో అంతేగాని 24 గంటలు దేహంగురించే ఆలోచిస్తూఉంటే నీకు ఆత్మజ్ఞానం ఎలాకలుగుతుంది. బాబాగుడిలోనే ఉన్నారు మనలోలేరు అనుకోవద్దు. ఆయన మనలోకూడాఉన్నారు. మనలోఉండి





మనలోపలఉన్న బలహీనతలను, వాసనలను మనకు తెలియజేసి, వాటిని తొలగించుకోవాలనే బుద్ధిని కలుగజేసి, వాటిని తొలగించుకొనేశక్తిని నీకుఇచ్చి వాటినుండి నిన్ను విడుదలచేస్తాడు లేకపోతే ఈ ప్రకృతిగుణాలనుండి విడుదలపొందటంఅసాధ్యం. మనకు శత్రువులు లోపలేఉన్నారు, బయట శత్రువులేరు. కోరిక, కోపం ఇవే మన శత్రువులు. ఈలోపలఉన్న శత్రువులను వదిలేసి బయట శత్రువులమీద ఎలా పగ తీర్చుకొందాం, వారిమీద ఎలా కక్షతీర్చుకొందాం, వాడిని ఎలా అవమానంచేద్దాముఅని చూస్తూఉంటాము ఎందుచేతనంటే మన శత్రువులు మనలోపలే ఉన్నారని మనం మర్చిపోయాము. నీ మనస్సుకు అంతర్దృష్టిని కలుగజేసి నీ శత్రువులు ఎవరో నీకు తెలియజేసి వాటినుండి నిన్ను విడుదలచేసేవాడే గురువు. అహంకారమును సంతృప్తిపరచటంకోసం జీవించేవారికి చీకటిలోకాలువస్తాయి. ఈశ్వరుడిని సంతృప్తిపరచటంకోసం జీవించేవారికి మోక్షంవస్తుంది. అందుచేత దైనందిన జీవితంలో మనం ఎలా జీవిస్తున్నాము ఈశ్వరుడి ప్రీతికోసం పనిచేస్తూ జీవిస్తున్నామా లేక

**ఆత్మ ఆనంద స్వరూపం, ప్రేమ స్వరూపం. ఆత్మ ప్రేమనుబట్టే సమస్తమూ ప్రియమౌతున్నది. ప్రేమ ఆత్మకంటే వేరుకాదు. విషయప్రేమ తక్కువ తరగతి ప్రేమ. ఇక ఆత్మ అనేది కేవలం ప్రేమయే. మరొకరకంగా చెప్పితే భగవంతుడు ప్రేమ స్వరూపుడు అన్నా అదే.**

**- భగవాన్ శ్రీ రమణ మహర్షి**

అహంకారమును తృప్తిపరచటంకోసం జీవిస్తున్నామాఅని ఎవరికివారు పరిశీలన చేసుకోవాలి. శవబుద్ధినుండి విడుదలపొంది శివబుద్ధిని పొందటానికి ప్రయత్నం చేయాలి. అదేసాధన.

మాకు అశాంతిగాఉంది, దుఃఖంవస్తోందిఅని చాలామందిఅంటారు. దానికి కారణం వైరాగ్యంలేకపోవటం. మనిషికి ఎంతోకొంత వైరాగ్యంఉండాలి. వైరాగ్యంలేకపోవటంవలన ప్రతీచిన్నవిషయానికి రియాక్టుఅవుతారు. మనం బాగుపడాలిఅంటే యాక్షన్‌పెంచుకోవాలి, రియాక్షన్ తగ్గించుకోవాలి. మా అత్తగారు కారణంలేకుండా నన్ను తిడుతోందిఅని ఒకకోడలు భగవాన్‌తో చెపుతుంది. మీఅత్తగారు ఎవరిని తిడుతున్నారు. దేహమునేనుఅనేబుద్ధి నీకుఉందికదా దానిని తిడుతోంది. దేహమునేనుఅనేబుద్ధిని నీవుపోగొట్టుకోవాలి. నీవు దానిని పోగొట్టుకోలేకపోతున్నావు మీఅత్తగారు దానిని పోగొట్టుకోవటానికి నీకు సహాయంచేస్తున్నారు అదికూడా సాధనే అన్నారు భగవాన్. ఏదిపోగొట్టుకోవాలో ముందు నీకు తెలియాలి. ఎవరైనా తిడుతూఉంటే కంగారుపడేది నీదేహంకాదు, దేహమునేనుఅనేబుద్ధికి కంగారువస్తోంది, అసలు నీవు తొలగించుకోవలసింది దానినే. అది ముందు నీకు అర్థంకావాలి. దైనందినజీవితంలో మీరుచేసే ప్రతీపని, మాట్లాడేప్రతీమాట గురువుఅనుగ్రహంపొందటానికి సహకరించేదిగా ఉండాలి. గురువు అనుగ్రహంలో పడితే మీపని పూర్తిఅయిపోతుంది. ట్రైనులో బెర్తు రిజర్వుచేసుకొంటే ఒకేసారి రెండు పనులు అయిపోతాయి. నిద్రఅయిపోతుంది, గమ్యానికి వెళ్లిపోతాము. అలాగే గురువుఅనుగ్రహం పొందినవాడికి ఈదేహయాత్ర సుఖంగా, శాంతిగా వెళ్లిపోతుంది, వాడు పొందవలసింది ఏదో పొందుతాడు. సాధనపేరుమీద వాడికి సఫరింగ్ ఉండదు. బెర్తు రిజర్వుచేసుకొన్నవాడికి ప్రయాణబడలికలేకుండా ప్రయాణం సాగిపోతుంది. ఎన్ని స్టేషన్లుమారినా వాడికి తెలియదు. ఒకవేళ ఇంజను ఎక్కడయినా చెడిపోయినా, ఇంజను మారుస్తారు. వాటిగొడవ ఏమీ వాడికి అక్కరలేదు, శుభ్రంగానిద్రపోతాడు. అలాగే గురువు అనుగ్రహంలో పడినవాడు ఏకష్టంలేకుండా బ్రహ్మానుభవంపొందుతాడు. ఒకవేళ నీవు తప్పించుకోవాలి అనుకొన్నా ఆయన అనుగ్రహంనుండి తప్పించుకోలేవు, బ్రహ్మానుభవం కలిగేవరకూ నిన్ను విడిచిపెట్టడు. గురువుకు మీపొగడ్తలు అక్కరలేదు, మీరుబాగుపడటం ముఖ్యం. ఒకోసారి మీతోప్రేమగా మాట్లాడతాడు, ఒకోసారి ఎదురుగాఉన్నా మీతోమాట్లాడడు. ఎక్కడో దూరంగా ఉన్న ఇతరులను పలకరిస్తాడు. వారితో ఆప్యాయంగా మాట్లాడతాడు మీవంకకూడాచూడడు.



5A

అప్పుడు ఇదేమి గురువుఅని మీకు కోపంవస్తుంది. మీలోపలఉన్నకోపం మీకు తెలియపర్చటానికి ఇటువంటి చిట్కాలు ఎన్నో గురువుచేస్తూ ఉంటాడు. ఒకోసారి ప్రేమగా మాట్లాడతాడు. ఒకోసారి కఠినంగామాట్లాడతాడు ఎందుకు అలామాట్లాడుతున్నాడో ఆయనకు తెలియాలిగాని మనకు తెలియదు. గురువు బాహ్యంగా ఒకరితో కఠినంగా మాట్లాడినా, ఒకరితో నెమ్మదిగా మాట్లాడినా లోపల హృదయంలో అందరిపట్ల సమానంగా ఉంటాడు, ఏమీ బేధంఉండదు. నీతో ఎలా మాట్లాడితే నీవు బాగుపడతావో అది గురువు చూసుకొంటూఉంటాడు. గురువు ఆగ్రహంకూడా అనుగ్రహమే అని గ్రహించినవారు ధన్యులు.

నేను అదిచేసాను, నేనుఇదిచేసానుఅని అస్తమాను వాటిని మోసుకొని తిరగవద్దు. అలా అనుకోవటంవలన అజ్ఞానం పెరుగుతుంది, మరణానంతరం చీకటిలోకాలు మిగులుతాయి. నీవు చేసింది మర్చిపో. మీకు కష్టాలు ఎక్కువగా వస్తున్నాయిఅని కంగారుపడవద్దు. సహనం విడిచిపెట్టవద్దు. ఇప్పుడు మీకుఉన్న సహనంకంటే ఇంకా సహనం పెంచుకోవాలికాని ఉన్న సహనాన్ని విడిచిపెట్టవద్దు. ఎవరిని గురువుగా ఎన్నుకోమంటారుఅంటే ఎవరి సమక్షంలో నీ మనస్సును నీవు మర్చిపోతున్నావో, ఎవరిసమక్షంలో ఆనందంలో, శాంతిలో ఊగిసలాడుతున్నావో వారిని నీ గురువుగా తీసుకోఅని చెప్పారు. బాబా ఎంత నిరహంకారో ఉదాహరణకుచెపుతున్నాను. నేను ఎంతోగొప్పవాడినిఅని మీరు అనుకొంటున్నారు మీరు విసర్జిస్తున్న మలంలో పురుగులు ఉంటాయి అందులో ఒక పురుగుతో సమానంనేను అని బాబాచెప్పారు. అహంకారం ఉన్నవాడు ఎవడైనా ఈమాట చెప్పగలడా ? ఈమాట అన్నాడని మనం ఆయనను పూజించటం మానివేస్తున్నామా? లేదు. ఒకటి మనం అర్థంచేసుకోవాలి ఆ మనిషికి అర్హతఉంటే, ఆ మనిషికి చైతన్యస్థాయి ఉంటే వాడు పూజింపబడతాడు మనకు ఇష్టంఉన్నా లేకపోయినా. అది భగవంతుడి చట్టం, ఈశ్వరుడి ప్రణాళిక. మనకు కావలసింది పుస్తకజ్ఞానంకాదు, బ్రహ్మంజ్ఞానంకావాలి. దేహవాసనలోనుండి, లోకవాసనలోనుండి, శాస్త్రవాసనలోనుండి మనలను విడుదలచేసేవాడే నిజమైనగురువు.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | |
|---|---|
| 23-01-02 To 28-01-02 | క్యాంప్ |
| 31-01-02 గురు | మహిళా మండలివద్ద, నర్సాపురం |
| 03-02-02 ఆది | లక్కవరం, తూ॥గో॥జిల్లా (మల్కీపురం వద్ద) |
| 07-02-02 గురు | చిలకలపూడి (బందరు) రంగనాథస్వామి గుడి |
| 08-02-02 To 15-02-02 | అరుణాచలం క్యాంప్ |

## కాశిపాడు గ్రామంలో శ్రీరామ భక్త సమాజ స్వర్ణోత్సవములు

ది. 16-01-2002న గణపవరం మండలం కాశిపాడు గ్రామంలో టి.టి.డి. వారి ఆధ్వర్యంలో శ్రీ రామభక్త సమాజ స్వర్ణోత్సవముల సందర్భముగ సంకీర్తనాచార్య కీ॥శే॥ శ్రీ వేగిరాజు వెంకట రామరాజుగారి కాంశ్య విగ్రహాన్ని సద్గురు శ్రీనాన్నగారు ఆవిష్కరించినారు. ఈ కార్యక్రమమునకు తాడేపల్లిగూడెం శాసనసభ్యులు శ్రీ యర్రా నారాయణ స్వామిగారు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించినారు. అనంతరం జరిగిన సభలో శ్రీనాన్నగారు రామరాజుగారియొక్క భక్తిని, రామనామంయొక్క ప్రాముఖ్యతను చెప్పినారు. నిరంతరము రామనామం స్మరించుటవలన మనస్సు శుద్ధి అవుతుందని దానిద్వారా మానసిక ఆరోగ్యము చేకూరుతుందని శ్రీనాన్నగారు వివరించి చెప్పినారు. సభకు విచ్చేసిన భక్తుల కోరికపై స్వర్గీయ వేగిరాజు వెంకట రామరాజుగారికి "సంకీర్తనా చక్రవర్తి" బిరుదును శ్రీనాన్నగారు యిచ్చినారు.



సంకీర్తనాచార్య కీ॥శే॥ శ్రీ వేగిరాజు వెంకట రామరాజుగారి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు

అదేరోజున మధ్యాహ్నం గం॥2-00 లకు సద్గురు శ్రీనాన్నగారు శివాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సభలో ఆధ్యాత్మిక శాంతిని గూర్చి ప్రవచించినారు.

## జిన్నూరులో రాష్ట్రస్థాయి మినీ వాలీబాల్ పోటీలు



శ్రీ చెరుకూరి బుద్ధరాజుగారి సన్మానం



శ్రీ కొక్కిరిగడ్డ జయరాజుగారి సన్మానం



విజయం సాధించిన పశ్చిమ గోదావరి జిల్లా జట్టు



విజయం సాధించిన శ్రీకాకుళం జట్టు

జిన్నూరులో శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు జిల్లా పరిషత్ హైస్కూలు గ్రౌండులో 2002 జనవరి 12,13,14,15 తేదీలలో రాష్ట్రస్థాయి మినీ వాలీబాల్ పోటీలు జరిగినాయి. ఈ పోటీలు జిన్నూరు హైస్కూలు పూర్వ విద్యార్థి సంఘమువారిచే నిర్వహింపబడినవి.

ఈ పోటీలలో బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్టు, బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు విజయం సాధించినవి.

ముగింపు సభలో సద్గురు శ్రీ నాన్నగారు ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ వెటరన్ అసోసియేషన్ అధ్యక్షులైన శ్రీ చెరుకూరి బుద్ధరాజుగార్ని, పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీ కొక్కిరిగడ్డ జయరాజుగార్ని ఘనంగా సన్మానించినారు.

సద్గురు శ్రీ నాన్నగారు మాట్లాడుతూ ఈ క్రీడాపోటీలు మనస్సు నిర్మలత్వానికి, చెడు వ్యసనాల జోలికి పోకుండా కాపాడటానికి, బాలబాలికలు చిన్న వయస్సునుండి క్రీడాశక్తిని పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు.